పెన్ పవర్
నెల్లూరు । తిరుపతి । చిత్తూరు

# భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



**సీతారాంపురం పెన్ పవర్ -ఏప్రిల్ 18**

గుడ్ ఫ్రైడే ప్రార్థనలు సీతారాంపురం మండలం వ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోక రక్షకుడు అయిన క్రీస్తు సర్వ మానవ పాప విముక్తి కోసం మరణశిక్ష పొందిన రోజును శుభ శుక్రవారం గా పేర్కొంటూ క్రైస్తవ విశ్వాసలందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు సిలువ మోసిన రోజును మరించారు. భక్తితో 40 రోజులు ఉపవాస దీక్షను ఆచరించిన విశ్వాసులు శుక్రవారం నాడు దీక్ష విరమించారు. సాంప్రదాయ బద్ధంగా పేదలకు దానాలు చేశారు సీతారాంపురంలో పలు ప్రార్థనా మందిరాలు కిక్కిరిసాయి.

## వక్ఫ్ బోర్డు చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఆగ్రాహం వ్యక్తంచేసిన ముస్లిం జెఏసి.

**ఈ నెల 21 తేదీ ముస్లిం జెఏసి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.**




**కావలి పెన్ పవర్ – ఏప్రిల్ 18**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ, ముస్లిం ఆస్తులను స్వాధీనం చేసుకునే కుట్రలో భాగమేనని ముస్లిం జెఏసి నాయకులు ఆరోపించారు. ఈ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ ఈనెల 21 సోమవారం ఉదయం 9 గంటలకు కావలి పట్టణంలోని జెండా చెట్టు వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో శుక్రవారం జేఏసీ నాయకులు షేక్ నషీర్ అహ్మద్, ఎంబి ఎఫ్ రెహమాన్, షేక్ షారుక్, వామపక్ష నాయకులు లక్ష్మీ రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ. భారత రాజ్యాంగం అన్ని మతాలకు వారి ఆస్తులను నిర్వహించుకునే హక్కును కల్పించిందని,అయితే కేంద్ర ప్రభుత్వం ఈ హక్కును కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు.ఈ చట్టంలో ముస్లిం నేతలను వక్ఫ్ బోర్డు సభ్యులుగా చూపించడం కేవలం మొసలి కన్నీరు కార్చడమేనని ఇది ముస్లిం మత ఆస్తుల పట్ల కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని వారు దుయ్యబట్టారు. దేశంలోని ముస్లింలు, ప్రజాస్వామికవాదులు, కార్మికులు మరియు అన్ని వర్గాల ప్రజలు ఈ వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని వారు తెలియజేశారు .బాబ్రీ మసీదు కూల్చివేత నుండి మొదలుకొని ఆర్టికల్ 370 రద్ద, ఎన్ఆర్సి వంటి చట్టాలను అమలు చేసే వరకు కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లుగా బాపిస్టు చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు.కేంద్ర ప్రభుత్వ బాపిస్టు విధానాలను వ్యతిరేకిస్తూ 21 వ తేదీ సోమవారం నిర్వహించనున్న ర్యాలీని విజయవంతం చేయాలని ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ముస్లిం సోదరులు,మైనారిటీలు, వామపక్ష నేతలు,ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ముస్లిం జెఏసి నాయకులు పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ముస్లిం జెఏసి కమిటీ నాయకులు జమీర్, జిలానీ, మహబూబ్ బాషా,ఎస్డీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే






**కావలి పెన్ పవర్ – ఏప్రిల్ 18**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదినం సందర్భంగా కావలి పట్టణంలోని జవహార్ భారతి కాలేజీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన షటిల్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. క్రీడలను ప్రారంభించిన ఆయన సరదాగా కాసేపు షటిల్ ఆడారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వం తో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. గెలిచినప్పుడు ఒదిగి ఉండాలని, ఓడినప్పుడు కృంగిపోకుండా తిరిగి విజయం కోసం ప్రయత్నించాలని క్రీడాకారులకు తెలిపారు.. ప్రతి ఒక్కరూ తమ ఒత్తిడిని తగ్గించుకోవడానికి కాసేపు ఆటలు ఆడాలని తెలిపారు. చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా షటిల్ టోర్నమెంట్ ను ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు.

# ముత్తుకూరుకు మహర్దశ

## మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దనున్న అదానీ ఫౌండేషన్









**ముత్తుకూరు, (పెన్ పవర్) ఏప్రిల్ 18**

పీ4 విధానంలో అభివృద్ధిలో భాగస్వాములు కానున్న ముత్తుకూరు పంచాయతీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పి.కృష్ణయ్య, కలెక్టర్ ఓ.ఆనంద్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ప్రకటించిన పోర్టు ప్రతినిధులు. అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జగదీష్ పటేల్, పీఆర్వో వేణుగోపాల్, కార్పొరేట్ ఎఫైర్స్ హెడ్ కేఎం రామ్, సీఎస్ఆర్ హెడ్ రాజేష్ రంజన్ తదితరులకు ధన్యవాదములు తెలిపినఅధికారులు.ప్రజాప్రతినిధులు. మొదటగా రెన్యూబల్ ఎనర్జీ, శానిటేషన్, ఎడ్యుకేషన్ ఎంపవర్మెంట్ అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్న అదానీ. స్టేడియం నిర్మాణంతో పాటు శ్మశానం అభివద్ధి బాధ్యతలను కూడా చేపట్టాలని కోరిన ఎమ్మెల్యే సోమిరెడ్డి. నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్ షిప్ కు ఎంపికైన కృష్ణపట్నం హైస్కూలు విద్యార్థినులు విష్ణుప్రియ, కె.పూజిత, బి.మిశ్రిత, ముత్తుకూరు హైస్కూలు విద్యార్థిని ఎ.పూజిత.ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు, అదానీ ప్రతినిధులు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీఓ నాగ అనూష, డ్వామా పీడీ గంగాభవాని, తహసీల్దార్ స్వప్న, ఎంపీడీఓ నాగమణి, పోర్టు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం

**మళ్లీ గాడిలో పడుతున్న అభివృద్ధి, సంక్షేమం -సాధారణ స్థితికి ప్రభుత్వ వ్యవస్థలు**





**వెంకటాచలం, (పెన్ పవర్) ఏప్రిల్ 18**

వెంకటాచలం మండలం రామదాసుకండ్రిగ పంచాయతీ నాయుడు పాళెంలో రూ.16 లక్షలతో నిర్మించిన సిమెంట్ రోడ్లతో పాటు ఆర్వో ప్లాంటును ప్రారంభించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి. మూడో సారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాక తొలిసారి తమ గ్రామంలో పర్యటించిన సోమిరెడ్డికి ఆత్మీయ స్వాగతం పలికిన నాయుడు పాళెం వాసులు. సోమిరెడ్డి మాట్లాడుతూ..... వైసీపీ పాలనలో కుప్పకూలిన వ్యవస్థలను టీడీపీ కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలో పెడుతోంది. ఏ శాఖ పరిధిలో ఆ శాఖకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు కార్పొరేషన్లలో సబ్సిడీ రుణాల పంపిణీ తిరిగి ప్రారంభమైంది. ఇరిగేషన్ కాలువలను పునరుద్ధరించే ప్రక్రియ కొనసా గుతోంది. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నాం అ న్నారు. పై కార్యక్రమంలో ఎంపీడీవో కల్పన, ఏఎంసీ చైర్మన్, గాలి రామకృష్ణారెడ్డి, రాధాకృష్ణన్ నాయుడు, నాగార్జున రెడ్డి, చాట్ల వెంకటసుబ్బయ్య, తెలుగు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పామూరు ఉమా 5వ వర్ధంతి సందర్బంగా రక్తదాన శిబిరం

**డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్‌ల సేవలు అమూల్యం.**

**డాక్టర్ బెజవాడ రవికుమార్**



**కావలి పెన్ పవర్ ఏప్రిల్ 18**

డాక్టర్ పామూరు శ్రీధర్ మరియు డాక్టర్ పామూరు శివప్రసాద్ సోదరులు సమాజానికి అమూల్యమైన సేవలు అందిస్తున్నారని కావలి రెడ్ క్రాస్ ఉపాధ్యక్షులు డాక్టర్ బెజవాడ రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తమ తల్లి పామూరు ఉమా 5వ వర్ధంతిని పురస్కరించుకొని డాక్టర్ శ్రీధర్, డాక్టర్ శివప్రసాద్, పామూరు రాజా లు శ్రీధర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డాక్టర్ రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పామూరు విశ్వనాధం, ఉమ దంపతులు చిన్న గ్రామంలో కష్టపడి వ్యవసాయం చేస్తూ తమ కుమారులు శ్రీధర్, శివప్రసాద్ లను మెడిసిన్ లో, రాజాను ఫార్మసీ లో మాస్టర్ డిగ్రీలు చదివించారని అన్నారు. తల్లితండ్రుల స్ఫూర్తితో డాక్టర్ శ్రీధర్ సోదరులు, పట్టణంలో మంచి వైద్యులుగా పేరు తెచ్చుకోవడతో పాటు, పేద ప్రజలకు ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నారని అన్నారు. డాక్టర్ శ్రీధర్ రెడ్ క్రాస్ తలసేమియా ఆసుపత్రికి గౌరవ వైద్యాధికారిగా, పాలకమండలి సభ్యునిగా సేవలు అందిస్తున్నారని వివరించారు. తమ తల్లి స్మారకంగా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని రవికుమార్ పేర్కొన్నారు. ఈ శిబిరం డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఝాన్సీ దంపతులతో పాటు 36 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు డాక్టర్ శ్రీధర్ తండ్రిగారు పామూరు విశ్వనాధం, పామూరు కామేశ్వరయ్య – కామాక్షమ్మ దంపతులు ప్రశంసాపత్రాలు, పండ్లు అందజేశారు. ముందుగా పామూరు ఉమా చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు కలికి శ్రీహరి రెడ్డి,కావలి రెడ్ క్రాస్ చైర్మన్ డి రవిప్రకాష్, వైస్ చైర్మన్ కె హరినారప రెడ్డి, కోశాధికారి ఏ మధుసూదన్ రావు, పాలకమండలి సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, యస్కె అబ్దుల్ నయీమ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## పుట్టినరోజు సందర్భంగా 60వ సారి రక్తదానం చేసిన ధామిశెట్టి.



**కావలి పెన్ పవర్ – ఏప్రిల్18**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటి, శ్రీ పొట్టిశ్రీరాములు జిల్లా శాఖ బ్లడ్ సెంటర్ నందు శుక్రవారం రెడ్ క్రాస్ నెల్లూరు జిల్లా శాఖ మాజీ వైస్ ఛైర్మన్ మరియు డి.బి.ఎస్ ఇంజనీరింగ్ కాలేజ్ కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు తన పుట్టినరోజు సంధర్భంగా 60 వ సారి రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో రక్తదానం చేశారు. ఈ సంధర్భంగా దామిశెట్టి సుధీర్ నాయుడు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 16000 కు పైగా రక్త దాతలు స్వచ్చందంగా రక్తదానం చేస్తున్నారు, రాష్ట్రములో రక్త నిల్వాలు కొరత వలన ఇంకా అనేక మందికి రక్తం అవసరం ఉన్నందున మరియు ముఖంగా ఎండాకాలం రక్త నిల్వాలు తగ్గుతున్నందున యువత రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. తదుపరి రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతిఒక్కరు కూడా తమ మిత్రులను, బందువులను రక్తదానం మీద అవగాహన కలిగించి వారిని రక్తదాతలుగా చేసి సమాజానికి మంచి జరిగే కార్య క్రమాలలో పాల్గొనాలని తెలియచేసారు. అనంతరం రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ కన్వీనర్ సి.హెచ్ అజయ్ బాబు శాలువాతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేసి, తలసేమియా పిల్లల కొరకు రెడ్ క్రాస్ రక్త నిధి కేంద్రం నుండి రక్తాన్ని ఇవ్వడం జరుగుతుందని, వారి కొరకు రక్త దాతలు రక్త కేంద్రం ద్వారా రక్తాని దానం చేయాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మోటివేటర్ అరిగేలా సాయి రామ్ మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.


## కృష్ణాజిల్లా నూతన ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించిన జి.గోపి ని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు..!




**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్,మచిలీపట్నం, ఏప్రిల్, 18:**

కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నూతన బాధ్యతలు స్వీకరించిన శ్రీ జి.గోపిగారిని గారిని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, ఐపీఎస్ కార్యాలయంలోమర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు సత్వర న్యాయం అందించే దిశగా న్యాయవ్యవస్థ భద్రతా వ్యవస్థ లు పరస్పర సహకారంతో సమర్థవంతంగా పని చేయాలని ఇరువురు ఆకాంక్షించారు.న్యాయశాఖకు పోలీసుశాఖకు ఉన్న సంబంధ బాంధవ్యాలు మరింత మెరుగు పడేలా చేస్తూ, నేరం చేసిన వారికి త్వరితగతిన శిక్ష పడేలా పూర్తి సహాయసహకారాలు కావాలని, బాధితులకు పూర్తిస్థాయిలో న్యాయం అందించేలా పోలీసు శాఖ తరపున కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు.ఎస్పీ తో పాటు బందరు డిఎస్పి సిహెచ్ రాజా, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,చిలకలపూడి ఇన్స్పెక్టర్ అబ్దుల్ నబీ,జడ్జి ని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## వీర్ల అంకమ్మతల్లికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు





**చీరాల,పెన్ పవర్,ఏప్రిల్ 18**

చీరాల మండలం పాత చీరాల గ్రామంలోని వీర్ల అంకమ్మ తల్లి దేవాలయాన్ని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య శుక్రవారం సందర్శించారు. తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వేటపాలెంలో గుడ్ ఫ్రైడే వేడుకలు



**వేటపాలెం,ఎన్ పవర్,ఏప్రిల్ 18**

సర్వమానవాళి పాప పరిహారమునకై జేసు క్రీస్తు ప్రభువు సిలువను మోసి, తన రక్తం చిందించి, సిలువపై మరణమొంది తిరిగి మూడవ రోజు లేచిన యేసుక్రీస్తు బోధించిన మార్గమే సర్వమానవాళ్ళికి మోక్ష మార్గమని ఆర్.సి.ఎం చర్చి విచారణ గురువు టీ. కరుణాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుడ్ ఫ్రైడే సూచికంగా ఆనాడు ఏసు ప్రభువు శిలువను మోస్తూ పొందిన శ్రమలను కళ్ళకు కట్టినట్లుగా పురవిధులలో ప్రదర్శించారు. ప్రపంచములోని క్రైస్తవ ప్రజలు 40 రోజులు పాటు ఎంతో పవిత్రముగా భక్తి శ్రద్ధలతో ఉపవాసలతో పవిత్రంగా ఆచరించే ఈ శిలువ మార్గం వేటపాలెంలో ప్రత్యేక ఆకర్షణంగా ఉందని చీరాల మాజీ ఏఎం సీ చైర్మన్ మార్పు గ్రెగోరి అన్నారు. ఈ కార్యక్రమము లో రోమన్ క్యాథోలిక్ మిషన్ గురువు టీ. కరుణాకర్, జె.యం.జె సిస్టర్స్ ప్రకాశమ్మ, రాజమ్మ, పెద్దలు మార్పు జార్జి, చేగూడి జాన్సన్, బీమవరపు అలెక్స్, మార్పు రోశయ్య , మార్పు బాలజేసు, మార్పు సుధాకర్, పిల్లి ఉదయ్, సలగల ప్రకాష్, ప్రదీప్, మేడికొండ శేషగిరి రావు,పెర్లి దావీదు, రాజారావు మరియు ఆర్.సి.ఎం యువత శ్యామ్, దిలీప్, సురేష్, చిన్న, నాని, సన్నీ, యెహోను, అబ్రహం పాల్గొన్నారు. వేటపాలెం లోని జేసునగర్, పొట్టిసుబ్బయ్య పాలెం, అక్కాయపాలెం, సిలోన్ కాలనీ, సెయింట్ ఆంథోనీ లెప్రసీ కాలనీ, రామచంద్రాపురం,సర్వోదయ కాలనీ క్రైస్తవ మహిళలు భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.

# యడ్లపాడులో కల్వరి సిలువయాత్ర

గుడ్‌ఫ్రైడే సందర్భంగా
ఆర్సీఎం చర్చి నిర్వహణ
కళ్లకు కట్టినట్లుగా క్రీస్తుసిలువ
యాత్ర సన్నివేశాలు
సిలువపై ప్రభువు పలికిన సందేశాలు
వివరించిన ఫాదర్ సుభాష్‌చంద్రబోస్







చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, ఏప్రిల్ 18 :

యడ్లపాడు : గుడ్‌ఫ్రైడే సందర్భంగా యడ్లపాడు గ్రామంలోని ఆర్సీఎం చర్చి జనాలతో కిక్కిరిసిపోయింది. ఆర్సీఎం చర్చి ఫాదర్ కొడవటి సుభాష్ చంద్రబోస్ నాయకత్వంలో కలువరి శిలువ యాత్రను నిర్వహించారు. ముందుగా లింగారావుపాలెం, మైదవోలు, జాలాది, ఉప్పరపాలెం గ్రామాల నుంచి క్రైస్తవులు పాదయాత్రగా యడ్లపాడులోని ఆర్సీఎం చర్చివద్దకు చేరుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు భారీ సిలువతో యాత్ర ప్రారంభమైంది. ఆర్సీఎం చర్చి ఆధ్వర్యాన వేలాది మంది విశ్వాసులతో స్తుతిగీతాలు పాడుకుంటూ క్రీస్తు శ్రమలను కళ్లకు కట్టిన చూపుతూ కల్వరి సిలువయాత్ర ఘనంగా ప్రారంభమైంది. 14 దివ్యస్థలాల ప్రాముఖ్యతను తెలిపిన యాత్రదిగువపల్లె (ఎస్సీ కాలనీ)లోని ఆర్సీఎం చర్చిలో వేలాది మంది విశ్వాసులతో ప్రారంభమై, గ్రామ వీధుల మీదుగా, హైవే సర్వీసు రోడ్డున సాగుతూ ఎరక్రొండ వరకు కొనసాగింది. యాత్ర మధ్యలో 14 దివ్య స్థలాల వద్ద ఆగి, ఆయా స్థలాల ప్రాముఖ్యతను ఫాదర్ సుభాష్ చంద్రబోస్ వివరించారు. పరుల పాపాలను కడిగివేసేందుకు యేసుప్రభు సిలువనెక్కిన రోజు శుభ శుక్రవారమని, ఇది క్రైస్తవ సమాజానికి ఎంతో శుభదినమని చెప్పారు. ఏసుప్రభువు తన రక్తాన్ని సిలువపై చిందించి పాపాల నుంచి సర్వమానవుల్ని విముక్తి కల్పించారన్నారు. కల్వరిలో ఏసుప్రభువు శ్రమలు కళ్లకట్టినట్లుకల్వరి సిలువయాత్రలో విప్పర్ల రమేష్(ఏసుక్రీస్తు), కారుచోల మల్లేశ్వరీ (మేరిమాత) క్రీస్తు పడిన శ్రమను ప్రత్యక్షంగా చూపిస్తూ జనహృదయాలను కదిలించారు. ఎడ్లూరి సంజీవరావు, బందెల మహేష్, బాలతోటి శౌరి, జోజయ్య, విప్పర్ల యోబు తదితరులు మిగతా పాత్రలను పోషించి యాత్రను మరింత జీవం పోశారు. దీంతో భక్తులు క్రీస్తు నాడు పడిన కష్టాలను చూసి కన్నీళ్లతో ప్రార్థనలు చేశారు. యానిమేటర్ కారుచోల నాగేశ్వరరావు, ఎం శ్యామ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆద్యాంతం సువార్త గీతాల ఆలాపనతో హైవే పక్కనే ఉన్న రహదారిమాత పుణ్యక్షేత్రానికి చేరుకుని, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# దివ్యాంగ బాలల్లో ఆత్మ స్థైర్యం నింపాలి

అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్..!

28 మంది దివ్యాంగ బాలలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.3,58,000 విలువ కలిగిన వీల్ చైర్లు, బ్యాటరీ వీల్ చైర్లు, ట్రై సైకిళ్ళు పంపిణీ

**స్టాఫ్ రిపోర్టర్,పెన్ పవర్, మచిలీపట్నం, ఏప్రిల్, 18**



దివ్యాంగ బాలల్లో ఆత్మ స్థైర్యం నింపాలని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం అవనిగడ్డ ప్రభుత్వ హైస్కూలులో జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని భవిత కేంద్రాల్లో ఉన్న దివ్యాంగ బాల బాలికలకు వీల్ చైర్లు, బ్యాటరీ వీల్ చైర్లు, ట్రై సైకిళ్ళు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని భవిత కేంద్రాల్లో ఇంటలెక్చువల్ డిజిబిలిటీ, సెరిబ్రల్ పార్సీ, ఆటిజం లెర్నింగ్ డిజిబిలిటీ, హియరింగ్ డిజిబిలిటీ తదితర సమస్యలతో బాధపడే 553 మంది దివ్యాంగ విద్యార్థులు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నమోదైన దివ్యాంగ విద్యార్థులకు నెలకు రూ.మూడు వేలు చొప్పున నియోజకవర్గంలో ఉన్న దివ్యాంగ విద్యార్థులకు రూ.16,59,000లు అలవెన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 9,10 తరగతి చదివే విద్యార్థులకు ప్రీ మెట్రిక్స్ స్కాలర్షిప్, 11, 12 చదివే దివ్యాంగులకు పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్షిప్ ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 28 మంది దివ్యాంగ బాలలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో రూ.3,58,000 విలువ కలిగిన వీల్ చైర్లు, ట్రై సైకిళ్ళు, బ్యాటరీ ట్రై సైకిళ్ళు, ఆట వస్తువులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఫణి దూర్జటి, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, ఎంపీపీ తుంగల సుమతి, ఎంఈఓలు శివశంకర్, ఏ.పిచ్చియ్య, ఆరు మండలాల ఎంఈఓలు, సమగ్ర శిక్ష సిబ్బంది, భవిత కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

# చర్చిల్లో ప్రార్థనలు నిర్వహించిన ఎమ్మెల్యే





**చీరాల,పెన్ పవర్,ఏప్రిల్ 18**

చీరాల పట్టణంలోని లూథరన్ చర్చి జేజేపేట విజిలిపేట నూతన చర్చ్ నందు గుడ్ ఫ్రైడే ప్రార్ధన కార్యక్రమంలో పాల్గొన్నారు ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరుణామయుడైన ఏసు ప్రభువును శిలువ వేసిన గుడ్ ఫ్రైడే రోజు, ఆ తరువాత ఆయన పునరుజ్జీవించిన ఈస్టర్ సండే రోజు. ఈ రెండూ మానవాళి చరిత్రను మలుపులు తిప్పిన ఘట్టాలు అని చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఈ మేరకు గుడ్ ఫ్రైడే శుభాకాంక్షలు తెలిపారు.





## 21న వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ర్యాలీ



**వేటపాలెం,పెన్ పవర్,ఏప్రిల్ 18**

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ వేటపాలెం మండలంలో ముస్లిం సోదరులు ఏప్రిల్ 21న సోమవారం నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం సోదరులు మాట్లాడుతూ అల్లా పేరు మీద ముస్లిం పూర్వీకులు దానం చేసిన వక్ఫ్ భూమిని అన్యాక్రాంతం చేసేందుకే చట్టంలో కొన్ని సవరణలు చేశారని, వీటిలో ముఖ్యంగా ముస్లింలు కాని వారిని వక్ఫ్ బోర్డులో సభ్యులుగా చేర్చడం, 12 సంవత్సరాలకు పైగా కబ్జా చేసిన వక్ఫ్ భూమిని అతనికే దక్కేలా చట్టంలో సవరణ చేయడం, వక్ఫ్ భూములను పరిశీలించే అధికారం న్యాయస్థానం నుండి కలెక్టర్ చేతికి మార్చడం వంటి పలు సవరణలు కుట్రపూరితంగా ముస్లిం సమాజాన్ని దెబ్బతీసేందుకే చేశారని వాటిని రద్దు చేసేంతవరకు తమ పోరాటం సాగుతుందన్నారు. రాజ్యాంగం అన్ని మతాలకు సొంత సంస్థలను నిర్మించుకునే హక్కు ఇచ్చిందని, ఇతరుల బోర్డుల్లో ముస్లింలను చేర్చుతారా అని ప్రశ్నించారు. సోమవారం ఉదయం 10 గంటలకు దేశాయిపేట పంచాయితీ రామానగర్ మసీదు వద్ద నుండి స్థానిక తహసిల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరుగుతుందని మండలంలోని కొత్తపేటతో సహా అన్ని పంచాయతీల నుండి ముస్లిం సోదరులందరూ పాల్గొని ర్యాలీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ హనీఫ్, 15వ వార్డు మెంబర్ మబూ జాని, మైనారిటీ సోదరులు నూర్ అహ్మద్, హుమాయున్ భాష, జిలాని తదితర ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థినికి 10 వేల ఆర్థిక సహాయం అందజేసిన ప్రముఖ వ్యాపారవేత్త వేలూరు జయచంద్ర నాయుడు.

**కావలి పెన్ పవర్- ఏప్రిల్18**

కావలి పట్టణానికి చెందిన పేద విద్యార్థిని సాయి ప్రియకు కావలి పట్టణం ప్రముఖ వ్యాపారవేత్త , సంయుక్త సేవా సంస్థ గౌరవ సభ్యులు వేలూరు జయచంద్ర నాయుడు నేడు వారి కార్యాలయంలో 10 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దాత వేలూరు జయచంద్ర నాయుడు మాట్లాడుతూ సాయి ప్రియ చిన్న వయసులోనే తన తండ్రిని కోల్పోయిందని , అప్పటి నుండి ఆమే తల్లి బట్టలు కుట్టి కుటుంబాన్ని పోషిస్తూ సాయిప్రియను ఎంసీఏ వరకూ చదివించారని తెలిపారు. ప్రస్తుతం సాయిప్రియ తల్లి అనారోగ్యం కారణంగా మంచానికే పరిమితం కావడంతో కాలేజీలో కట్టాల్సిన ఫీజును కట్టలేని కారణంగా ఒరిజినల్ సర్టిఫికెట్స్ అన్నీ కాలేజీలోనే ఉన్నాయని తెలిపారు. సంయుక్త సేవాసంస్థకు సాయిప్రియ గురించి తెలియడంతో దాతల సహకారంతో సాయి ప్రియకు అవసరమైన సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర కృషి చేస్తూ ఉన్నాడని తెలిపారు. సాయి ప్రియ మాట్లాడుతూ తన సర్టిఫికెట్స్ తెచ్చుకోవడానికి ఆర్థిక సహాయం అందజేసిన వేలూరు జయచంద్ర నాయుడుకి మరియు తనగురించి దాతలకు తెలియజేసి తనకు సహాయం అందేలా చేస్తున్న సురేంద్ర అన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ ఉన్నానని చెప్పారు.



# విద్యుత్ వినియోగదారులకు పీఎం సూర్య ఘర్ యోజన పథకం గొప్ప వరం

తక్కువ బిల్లులతో నాణ్యమైన విద్యుత్తును పొందే అవకాశం.
కేవలం గృహ వినియోగ మాత్రమే పీఎం సూర్య ఘర్ యోజన పథకం వర్తింపు.
వినియోగదారులు బ్యాంకుల ద్వారా సౌకర్యం పొందే అవకాశం.
అధిక మొత్తంలో ప్రభుత్వ రాయితీ కల్పన.
రెడ్డిచర్లలో పిఎం సూర్యఘర్ పథకం సోలార్ పై అవగాహన సదస్సు నిర్వహించిన కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు.





**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 18**

విద్యుత్ వినియోగదారులకు పీఎం సూర్య ఘర్ సోలార్ యోజన పథకం గొప్ప వరమని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. పీఎం సూర్య ఘర్ యోజన పథకం పై మండలంలో నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా శుక్రవారం కొమరోలు మండలం రెడ్డి చర్ల గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు ఆ కార్యక్రమానికి విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఆ గ్రామ సర్పంచ్ రెడ్డి చర్ల ఉమాదేవి ఉపసర్పంచ్ గొంగటి శేషు తదితర గ్రామ పెద్దలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు .ఆ సందర్భంగా ఏఈ శ్రీనివాసులు మాట్లాడుతూ పి ఎం సూర్య ఘర్ పథకం విద్యుత్ వినియోగదారులకు గొప్ప వరమని ఈ పథకం కేవలం గృహ వినియోగదాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ఒక కిలో వాట్ కు 120 యూనిట్ల సోలార్ ఉత్పత్తి జరుగుతుందని ,ఒక కిలో వాట్ విద్యుత్ను పొందుతున్న వినియోగదారులకు ప్రస్తుతం నెలకు వెయ్యి రూపాయలు బిల్లు వస్తున్నదని, అయితే సోలార్ ఏర్పాటు ద్వారా నెలకు కేవలం 338 రూపాయలు మాత్రమే బిల్లు వస్తుందని తెలిపారు. దీనితో ఏడాదికి ఎనిమిది వేల రూపాయలు ఆదా అవుతుందని, అంతేగాక ప్రభుత్వము 30 వేల రూపాయల మేర రాయితీ కల్పిస్తుందని ఆయన చెప్పారు. రెండు కిలోవాట్లకు 240 యూనిట్లు సోలార్ ఉత్పత్తి అవుతుందని, రెండు కిలోవాట్ల విద్యుత్తును ఉపయోగించుకుంటున్న వినియోగదారులకు దాదాపు 2000 రూపాయలు నెల బిల్లు వస్తుందని, అయితే సోలార్ వినియోగం ద్వారా కేవలం 333 రూపాయలు మాత్రమే బిల్లు వస్తుందని, దీనితో సంవత్సరానికి 20 వేల రూపాయల ఆదా అవుతుందని చెప్పారు. ఇక ప్రభుత్వం 60 వేల రూపాయల వరకు రాయితీవస్తుందని పేర్కొన్నారు. మూడు కిలోవాట్లకు సోలార్ సిస్టం ద్వారా 360 యూనిట్లు ఉత్పత్తి అవుతుందని, మూడు కిలోవాట్ల మేర విద్యుత్ వినియోగించుకున్న వినియోగదారులకు నెలకు 3000 రూపాయల మేర బిల్లు వస్తున్నదని, అయితే సోలార్ సిస్టం ద్వారా కేవలం నెలకు 293 రూపాయలు మాత్రం బిల్లు వస్తుందని అన్నారు. దీనితో ఏడాదికి 32 వేల రూపాయలు ఆదా అవటమే కాకుండా ప్రభుత్వం 78 వేల రూపాయల మేర రాయితీ ఇస్తుందని ఆయన వివరించారు. పి ఎం సూర్య ఘర్ సోలార్ పథకం పొందే వారికి బ్యాంకులు రుణ సౌకర్యం కూడా కల్పిస్తాయని వినియోగదారులకు నెలకు అతి తక్కువ బిల్లులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన వివరించారు. అందువల్ల విద్యుత్ గృహ వినియోగదారులు పి ఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని పొంది సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాసులు కోరారు. ఆ కార్యక్రమంలో రెడ్డిచెర్ల గ్రామం తో పాటు పరిసర గ్రామాల విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖ లైన్ ఇన్స్పెక్టర్ ఖాదర్ బాషా ,రెడ్డి చర్ల సబ్ స్టేషన్ లైన్మెన్ గంగోజి రమణాచారి, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## పరిమితికి మించి జనాలతో అట్లాడొద్దు





**పొన్నలూరు, పెన్ పవర్ ఏప్రిల్ 18**

స్థానిక పోలీస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వాహనదారులకు రోడ్డు ప్రమాధాలపై ఆటో ట్రాక్టర్ డ్రైవర్ లకు ఎస్సై కె అనూక్ శుక్రవారం నాడు అవగాహనా కల్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి మనుషులను ఆటోలలో పోగాకు ట్రాక్టర్ లలో గమ్యస్థానాలకు చేర్చటంలో విఫలమవుతున్నారని, కూలి పని చేసుకుంటూ జీవనం చేస్తున్న వారి జీవితాలతో ఆటలాడుకోవద్దని హెచ్చరించారు, ఈ సందర్భంగా ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని వ్యవసాయ కూలీ పనులకు వెళ్లే వారిని పరిమితంగా ఎక్కించుకోవాలని సూచించారు, ట్రాఫిక్ నియమ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు, ప్రతి ఒక్క ఆటో డ్రైవర్ నియమనిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 18**

వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలు మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పనులు కొనసాగుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు వ్యవసాయం లో పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు చేతికందక ఎక్కువ శాతం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లారు. కూలీలకు వ్యవసాయ పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు ఎక్కువ శాతం కూలీలు వెళ్లడంతో ఉపాధి హామీ పనులు గ్రామాల్లో ముమ్మరముగా సాగుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సాధించి అత్యధిక మంది కూలీలకు ఉపాధి కల్పించడంతో కూలీలకు చేతినిండా ఉపాధి పని దొరకడంతో కూలీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరముగా మారుతోంది. ప్రభుత్వం ఒక్కో కూలికి రోజుకు సగటున రూ. 307 ప్రకటించడం ద్వారా ఉపాధి కూలీలకు కూలీ గిట్టుబాటవుతుంది. ఎండలు కూడా తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలు చాల గ్రామాల్లో ఉదయము 6 గంటలలోపే పని ప్రదేశాలకు చేరుకొని మధ్యాహ్నం లోపే పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. ఉపాధి హామీ పథకంలో నిరుపేదలు జీవన ఉపాధి



పొందుతుండగా ప్రస్తుతం వేసవిలో రైతు కుటుంబాల్లోని సభ్యులు సైతం ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఉపాధి కూలీలకు ఎండలు ఎక్కువగా ఉండటంతో పనికి వెళ్లే కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి సిబ్బంది కూలీలకు తెలియజేస్తూ వడదెబ్బకు గురికాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపాధి కూలీలకు అందజేస్తున్నారు.

## ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో

# నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

### ఆర్.కె.వలి, గూడంశెట్టి రవికుమార్





**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 18**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్వర్యంలో జననీ చారిటబుల్ ట్రస్ట్ శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి నాయకులు ఆర్. కె.వలి మండల జనసేన పార్టీ నాయకులు గూడంశెట్టి రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు అనగా శనివారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రముఖ కంటివైద్య నిపుణులచే వైద్యపరీక్షలు నిర్వహించి, కంటి పరీక్షలు చేసి శుక్లాలు ఉన్నవారికి గుంటూరులోని శంకర నేత్ర వైద్యాలయంలో ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆద్వర్యంలో బస్సులో ఇక్కడి నుండి తీసుకువెళ్లి ఆపరేషన్ అనంతరం తిరిగి బస్సులో ఇళ్లకు చేరుస్తారని తెలిపారు ఎమ్మెల్యే ఉగ్ర అందించే ఉచిత సేవలను కంటి సంబందిత వ్యాధిగ్రస్థులు ఉచిత కంటి వైద్యశిబిరం ఉపయోగించుకోవాలని అదేవిధంగా గతంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తారని అలాగే ఉచిత వైద్య శిబిరంనకు వెళ్లేవారు సంభదిత ఫోటోగుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, ఫోను నెంబరు ను తీసుకొని వెళ్లాలని తెలిపారు.

## స్వచ్ఛ ఆంధ్రా స్వచ్ఛ దివాస్ - కార్యక్రమం పై అవగాహన ర్యాలీ

### కమీషనర్ శ్రీనివాసరావు






**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 18**

ఇ వెస్ట్ వస్తువులు సేకరించి ఆర్ ఆర్ ఆర్ సెంటర్ కు తరలించుట పై అవగాహన ర్యాలీ ని శనివారం ఉదయం 10 గంటలకు గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయం నుండి గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ అనంతర. మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేయించడం జరుగుతుందని కమీషనర్ శ్రీనివాస రావు ఒక ప్రకటనలో తెలిపారు గిద్దలూరు నగర పంచాయతీ చైర్ పర్సన్ పాముల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన ఈకార్యక్రమం ఏర్పాటు చేయడమైనదన్నారు ఈ కార్యక్రమములో గిద్దలూరు నియోజకవర్గ శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గారు ముఖ్యఅతిథి పాల్గొంటారని. తెలుపుతూ కార్యక్రమమునకు వైస్ చైర్మన్లు, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, నగర పంచాయతీ సిబ్బంది, మెప్మా సిబ్బంది, సచివాలయ సిబ్బంది పట్టణ ప్రజలు అందరూ పాల్గొని కార్యక్రంమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## దద్దవాడలో చేపట్టిన అమృత్ సరోవర్ పనులను పర్యవేక్షించిన ఎంపీడీవో మస్తాన్ వలి

***ఉపాధి హామీ పథకం కూలీలకు రోజుకు 300 రూపాయలు గిట్టుబాటు అయ్యేందుకు సూచనలు సలహాలు ఇచ్చిన ఎంపీడీవో.***

***ఉపాధి హామీ పథకం కూలీలకు కనీస సౌకర్యం కల్పించాలని సూచనలు సలహాలు.***



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 18**

కొమరోలు మండలం దద్దవాడ గ్రామ పొలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్వహిస్తున్న అమృత సరోవర్ పనులను శుక్రవారం కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్వలి సందర్శించి పరిశీలించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా దద్దవాడ సమీపంలో అమృత్ సరోవర్ నీటి కుంటను ఏర్పాటు చర్యలు తీసుకున్నారు .ఆ సందర్భంగా ఉపాధి హామీ పథకం కూలీలు అమృత్ సరోవర్ నిర్వహిస్తున్నారు. ఆ కార్యక్రమాన్ని ఎంపీడీవో మస్తాన్వలి కొమరోలు ఇన్చార్జి ఎపిఓ మహాలక్ష్మి దేవి సందర్శించి పర్యవేక్షించారు .ఆ సందర్భంగా కూలీలకు తమ సూచనలు సలహాలు ఇచ్చారు .కాగా ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చేస్తున్న కూలీలకు రోజుకు 300 రూపాయలు కూలీ గిట్టుబాటు అయ్యేందుకు అవసరమైన సూచన సలహాలను ఎంపీడీవో ఇచ్చారు. పనులు చేపట్టిన కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన ఏపీ ఓ మహాలక్ష్మి దేవిని కోరారు. ఆ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం చెందిన టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు మెట్లు కూలీలు పాల్గొన్నారు.

## ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు

**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 18**

చంద్రశేఖరపురం మండలంలోని పలు గ్రామాలలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవ సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. క్రైస్తవులు అత్యంత పర్వదినముగా చేసుకునే పండుగలలో గుడ్ ఫ్రైడే ఒకటి ఈ పండుగ సందర్భంగా విశ్వాసులు మండలంలోని అన్ని ప్రార్థన మందిరాల్లో ప్రభువును స్మరించుకుంటూ భక్తిశ్రద్ధలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు హాజరై ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు పలువురు పాధర్ లు, పాస్టర్లు పాల్గొన్నారు.

